ప్రజాశక్తి

శుక్రవారం 8 ఆగస్టు 2025 5 అనంతపురం

అహుడాలో నిఘానేత్రం..!

◆ కార్యాలయంలో విషయాలపై బయటి వ్యక్తుల ఆరా

◆ ఏమి జరుగుతుంతో తెలుసుకునే ప్రయత్నం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ(ఆహుడా)లో మూడో నిఘానేత్రం కీలక పాత్ర పోషిస్తోందనే చర్చ సాగుతోంది. అహుడాలో ఎప్పటికప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఆసక్తి, ఆత్రుత కలిగిన కొందరు వ్యక్తులు నిఘా నేత్రాన్ని ఆసరాగా తీసుకుని వారి పనులు చక్కబెట్టుకునేలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొన్ని నెలల క్రితం ఈ నిఘా నేత్రంలో సమస్యలు తలెత్తాయి. దీని అవసరం ఉన్న బయట వ్యక్తులు కార్యాలయ వర్గాలకు ఫోన్ చేసి దీనిపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. నిఘానేత్రం పనిచేయని అంశం సదరు వ్యక్తులు ఆరా తీసిన తర్వాతే అహుడా కార్యాలయం వర్గాలకు తెలియడం గమనార్హం. గతంలో అన్నింటా తామై చక్రం తిప్పిన వ్యక్తులు బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత కూడా అహుడా కార్యాలయంలో జరిగే విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరు అహుడాలో పనిచేస్తూ వారి కనుసన్నల్లో కార్యకలాపాలను జరిపించుకున్నారు. వారికి తెలియకుండా ఏ చిన్న పని జరిగినా సంబంధిత సిబ్బందిని వేధింపులకు గురి చేసేవారు. వారికి భయపడడం అలవాటు చేసుకున్న కొందరు ఉద్యోగులు ఇప్పటికీ వారి గుప్పిట్లోనే చిక్కుకుపోయారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. గతంలో ఇద్దరూ మాత్రమే ముఖ్యులకు సన్నిహితంగా మెలుగుతూ ఆహుడాలో జరిగే కార్యక్రమాలను వారికి అనుకూలంగా చక్కబెడుతూ ఉండేవారన్న విమర్శలున్నాయి. వీరిద్దరు కాకుండా పొరపాటున ఎవరైనా చొరవ తీసుకుని పనులు చక్కబెట్టేందుకు వెళ్తే వారిపై నిఘా ఉంచి ఇబ్బందులకు గురి చేసేవారు. అప్పట్లో లక్షలాది రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రణాళికపై పత్రికల్లో విమర్శనాత్మక కథనాలు రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇది ఆగినా ఇతరత్రా వ్యవహారాల ద్వారా ఆ ఇద్దరూ సొమ్ము చేసుకునే ప్రయత్నాలు మాత్రం ఆపలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆహుడాకు పాలకవర్గం మారింది. ఆహుడా నిర్వహణ బాధ్యతల్లో కొత్త వారు వచ్చినా నిఘానేత్రం ద్వారా సదరు పాత వ్యక్తులు కార్యాలయం కార్యకలాపాలను మాత్రం ఇప్పటికీ తెలుసుకుంటూనే ఉండడం గమనార్హం. గత నెలలో ఇన్‌ఛార్జి కలెక్టర్, అహుడా వైస్ ఛైర్మన్ శివ నారాయణ శర్మ ఆహుడాపై సమావేశం నిర్వహించారు. ఆహుడా ఛైర్మన్ లేకుండా సిబ్బందితోనే ఈ సమావేశం జరిగింది. అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ అదే రోజు సాయంకాలం సిబ్బందితో మళ్లీ హడావుడిగా మరో సమావేశం నిర్వహించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లిద్దరూ ఎవరికి వారు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించడం వెనుక వారి మధ్య ఏవైనా విభేదాలు పొడచూపాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిణామాలను సైతం మూడో నిఘానేత్రం ద్వారా తెలుసుకున్న బయటి వ్యక్తులు సమావేశంలో ఏమి జరిగిందన్న అంశాలను ఆరా తీసినట్లు సమాచారం. అహుడా కార్యాలయంలో జరిగే సమావేశాలు గురించి పత్రికలకు సైతం సమాచారం ఇవ్వడం లేదు. సమాచార శాఖ ద్వారా సమావేశ వివరాలను ఫొటోలను పంపుతున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారన్న దానికి సంబంధిత అధికారుల నుంచి మౌనమే సమాధానంగా వస్తోంది.

ఆహుడా పరిధిలో నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లు ఇటీవల స్వయంగా ఛైర్మన్‌ను కలిసి సన్మానం చేసి వారి సమస్యలు వివరించి వెళ్లారు. పంచాయతీల్లో భవన నిర్మాణాలకు అనుమతులు జారీ కాకపోవటంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా లేఅవుట్లు, వెంచర్లు వెలుస్తున్నాయని వాటికి అడ్డుకట్ట వేసి అనధికార లేఅవుట్లలో స్థలాలు కొని మోసపోకుండా నివారించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆహుడా పరిధిలో మూడో నిఘానేత్రం క్రియా శీలకంగా వ్యవహరించటం చూస్తే అక్కడే ఏదో జరుగుతోందన్న ప్రచారం జోరుగా నడుస్తోంది.

పామాయిల్ కొరత..!

పూర్తి స్థాయిలో అందుబాటులో లేని నూనె

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాన్యుడి నూనెగా భావించే పామాయిల్ కొరత మార్కెట్‌లో నెలకొంది. పామాయిల్ కావాలంటే ఇప్పుడు అనేక షాపుల్లో వెతుక్కునే పరిస్థితి ఉంది. ఎక్కడా పూర్తి స్థాయిలో ఆ నూనె అందుబాటులో లేదు. ఇతర నూనెలు అవసరమైన మేరకు అందబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. పామాయిల్ మాత్రం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా తగినంత స్టాకు ముందులా ఉండటం లేదు.

అనంతలో రోజుకు వంద టన్నుల వరకు అవసరం

దేశంలో వినియోగించే నూనెల్లో అత్యధికం పామాయిల్‌యే ఉంటుంది. ఇది ఎక్కువ శాతం మలేసియా నుంచి ఇండియాలోకి వచ్చేది. కొన్ని నెలలుగా దిగుమతిలో కొంత అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో పామాయిల్ దిగుమతులు తగ్గాయి. అంతకు మునుపు పూర్తి స్థాయిలో ఈ నూనె అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సామాన్య ప్రజలు ఎక్కువగా ఈ నూనెను వంటలకు వాడుతుంటారు. ఒక్క అనంతపురం నగరంలోనే ఈ నూనె రోజుకు వంద టన్నుల వరకు అమ్మకాలు సాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు అందుబాటులో పది టన్నులు కూడా లేకుండా ఉంది. పామాయిల్ కావాలంటే నాలుగైదు షాపులు తిరిగితేగాని దొరకడం లేదు. హోటళ్లు, పెళ్లిళ్లు, ఇతర పెద్దపెద్ద వంటలన్నింటికీ ఈ నూనెనే వాడుతూ వచ్చేవారు. ఇప్పుడు ఈ నూనె లేకపోవడంతో ప్రత్యామ్నాయంపై చూస్తున్నారు.

రోజుకు నలబై, యాభై బాక్సులు పోయేవి

రోజుకు తన వద్దనే నలబై నుంచి యాభై బాక్సులు పామాయిల్ నూనె కిలో పాకెట్లు పోయేవి అని నగరంలోని గాంధీబజారులో నూనే వ్యాపారం చేసే వ్యాపారి ఒకరు తెలిపారు. ఇప్పుడు స్టాకు ఆర్డర్ పెట్టినా వెంటనే రావడం లేదు. జులై 27వ తేది పామాయిల్ స్టాకు కోసం ఆర్డర్ పెడితే ఆగస్టు 6వ ఆరవ తేది వరకు కూడా రాలేదని ఆయన తెలిపారు. అయితే పొద్దుతిరుగుడు నూనె, వేరుశనగ నూనెలు అవసరమైన మేరకు స్టాకు ఉందని, దీంతో ప్రజలకు పెద్దగా సమస్య లేకుండా ఉందని ఆ వ్యాపారి తెలిపారు. ధరల్లోనూ వ్యత్యాసం ఏమీ రాలేదని అన్నారు. పెద్ద పెద్ద ఫంక్షన్‌లు, హోటళ్లకు ఎక్కువగా పామాయిల్‌ను వినియోగించే వారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

మహాసభల బ్రోచర్లను విడుదల చేస్తున్న ఆహ్వాన సంఘం నాయకులు

ఐద్వా రాష్ట్ర మహాసభల బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల బ్రోచర్‌ను గురువారం అనంతపురం లలిత కళాపరిషత్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ అరుణ, పద్మజ, డాక్టర్ బాల కుమారి, డాక్టర్ ప్రసూన, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర నాయకులు వి.సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది మహిళ ఉద్యమ నేతలు మహాసభల్లో పాల్గొంటారన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను ఈ సభల్లో రూపొందించనున్నట్లు చెప్పారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా అఖిలభారత అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమతి, మరియం దావలె, పుణ్యవతితో పాటు రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచిన మహిళమణులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, జిల్లా నాయకులు చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

బుక్కరాయసముద్రం: హర్ ఘర్ తిరంగా ర్యాలీని గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.శైలజ, ఎంపీపీ డి.సునీత, రవీంద్ర, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సల్మాన్, యుఒఆర్‌డి సదాశివ, ఎంఇఒ లింగా నాయక్, వెలుగు ఏపీఎం అనిత దేవి పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన పిపిఎల్ కంపెనీ ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

పిపిఎల్ కంపెనీ ఎరువులు గురువారం జిల్లాకు వచ్చినట్లు ఎడిఎజి ఎం.అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. ఇందులో యూరియా 213.8 మెట్రిక్ టన్నులు, 10.26:26 ఎరువులు 244 మెట్రిక్ టన్నులు, 28:28:0 ఎరువులు 244 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. యూరియ మార్క్ ఫెడ్‌కు 115 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్లకు 98.8 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. మండల కేంద్రంలో 46 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలతో ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు రాజమణి, శాంతమ్మ ఆధ్వర్యంలో ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యతను వైద్యుడు లోకేష్ కుమార్ తెలియజేశారు.

రైతు పితామహుడు ఎంఎస్.స్వామినాథన్

రైతుసంఘాల ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతుల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు, రైతు పితామహుడు ఎంఎస్.స్వామి నాథన్ అని రైతు, కౌలు రైతుసంఘం నాయకులు తెలిపారు. భారతదేశ హరిత విప్లవ పితామహుడు ఎమ్మెస్.స్వామినాథన్ జయంతి వేడుకలను గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో కైలు రైతు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి అర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ దేశంలో రైతాంగం, ప్రజల అభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. ఢిల్లీ రైతాంగ పోరాటం 14 నెలలు పాటు కొనసాగేందుకు ఎమ్మెస్ స్వామినాథన్ స్ఫూర్తి అన్నారు. వ్యవసాయం, రైతులు అభివృద్ధి చెందాలంటే స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఈ బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాకు దాసోహం అయ్యి భారతదేశ ఎగుమతులపై 25శాతం పన్నులు పెంచినా నోరమెదపని పరిస్థితుల్లో ఉండడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వామినాథన్ సిఫార్సుల అమలు కోసం ప్రజలు, రైతులు, కూలీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్రామిరెడ్డి రాజీవ్ కాలనీ ఉపసర్పంచి మసూద్, విజయ్ శశిదర్ ,సునంద పాల్గొన్నారు

స్వామినాథన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

పాఠశాల ముందు వర్షం నీరు

ప్రజాశక్తి-యల్లనూరు

పాఠశాల ముందు నిలిచిన వర్షం నీరు

చిన్నపాటి వర్షం పడిన మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల ముందు నీటితో ముడుగు ఏర్పడుతోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి పాఠశాల వద్ద ఉంటోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటనకు వచ్చిన సమయంలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారింది. గత నెలలలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పర్యటన సందర్భంగా అత్యవసరమైన చోట పారిశుధ్య కాలువలపై కంప చెట్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు మాత్రం తుతూమంత్రంగా కంప చెట్లను తొలగించి మిన్నకుండిపోయారు. దీని వల్ల మురుగునీరు రోడ్లపై చేరుతోంది. జిల్లా ఉన్నత పాఠశాల ముందు పాఠశాల వద్ద కూడా నిత్యం నీళ్లు నిలబడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ముందు వర్షం నీరు నిలవ కుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

పారిశ్రామిక నైపుణ్యం అవసరం

ఇండస్ట్రియల్ రిలేషన్స్ డైరెక్టర్ కిరణ్మయి

ప్రజాశక్తి-అనంతపురం

పారిశ్రామిక అవసరానికి అనుగుణంగా విద్యార్థులు అందులో నైపుణ్యం సాధించాలని ఇండస్ట్రియల్ రిలేషన్స్ డైరెక్టర్ కిరణ్మయి తెలియజేశారు. అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'హౌ స్టూడెంట్స్ కెన్ ప్రిపేర్ ఫర్ ఇండస్టటరీ రెడీ" అనే అంశంపై రీసోర్స్ పర్సన్ ఆర్.శేషు కుమార్ విద్యార్థులకు పలు మెళకువలు వివరించారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డికోడింగ్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి డా॥జె.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుకుళ్లు నివారణతో పంటకు మేలు

ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యాన పంటల్లో వేరుకుళ్లు తెగుళ్లు రాకుండ ట్రై కో డర్మా విరిడి వాడితో ఉపయోగాన్ని ఇస్తుందని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత పేర్కొన్నారు. గురువారం తాటిచెర్ల గ్రామ రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మలత మాట్లాడుతూ ట్రైకోడెర్మా విరిడిని అన్ని వ్యవసాయ, ఉద్యాన పంటల్లో వాడొచ్చన్నారు. మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మల్లికార్జున అలేఖ్య, గ్రామ ఉద్యాన సహాయకులు గంపరాజు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత

అధిక వడ్డీలతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీ వ్యాపారులు చేస్తున్న దోపిడీకి తట్టుకోలేక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వాలకు పట్టదా అని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వడ్డీ వ్యాపారులు మైక్రో ఫైనాన్స్ సంస్థలు చేస్తున్న దోపిడీకి అనేకమంది బలవుతున్నారన్నారు. ఇటీవల ఎస్పీ కార్యాలయంలో ఒక బాధితుడు వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నంకు యత్నించాడన్నారు. బుధవారం నాడు అనంతపురంలోని ఓ బ్యాంక్ ఉద్యోగి కూడా అధిక వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అనేక మంది అధిక వడ్డీలు, మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తీసుకున్న అప్పు వడ్డీతో సహా చెల్లించినప్పటికీ వారు విధిస్తున్న చక్ర వడ్డీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో మరొకచోట అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ వడ్డీలు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత బెట్టింగ్ యాప్, క్రికెట్లో పందేలు ఆడి అప్పులు చేసి తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఈ బెట్టింగ్ యాప్‌లను నిర్మూలించాలన్నారు. ఆన్‌లైన్ లోన్లు ఇస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ప్రజల అవసరాల నిమిత్తం రుణాలు ఇచ్చి ఆదుకుంటే మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులను ప్రజలు ఆశ్రయించే అవసరం ఉండదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులపై కఠినమైన చర్యలు తీసుకుని ప్రజల మాన, ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలపై కలెక్టర్, ఎస్పీ స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గీతాంజలి సృష్టికర్త, నోబుల్ బహుమతి గ్రహీత జాతీయ గీతాన్ని అందించిన గొప్ప వ్యక్తి రవీంద్ర నాథ్ ఠాగూర్ అని జిల్లా గ్రంధాల సంస్థ కార్యదర్శి పి.రమ తెలిపారు. గురువారం జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కార్యదర్శి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి లైబ్రేరియన్ పి.కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ డి.గోవిందు, జూనియర్ అసిస్టెంట్ హెచ్.రామాంజనమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ అధికారులు, సిబ్బంది

విద్యార్థులకు క్రీడలూ అవసరమే

జెఎన్‌టియు విసి, స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్ హెచ్.సుదర్శన్ రావు

మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని ప్రతిభ చాటాలని జెఎన్‌టియు ఉపకులపతి, స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్ ఆచార్య హెచ్.సుదర్శన్ రావు పేర్కొన్నారు. గురువారం నాడు జెఎన్‌టియు ఆర్యభట్ట ఆడిటోరియంలో జెఎన్‌టియు అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల 16వ సమీక్ష సమాశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విసితో పాటు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థుల క్రీడలను జీవితంలో ఒక భాగంలా చూడాలన్నారు. క్రీడాల అభివృద్ధికి జెఎన్‌టియు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని తెలియజేశారు. ఫిజికల్ డైరెక్టర్లు ముందుండి క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని తెలియజేశారు. రిజిస్ట్రార్ క్రిష్ణయ్య 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన క్రీడలు గురించి తెలియజేశారు. జెఎన్‌టియు తరపున క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా ఆటల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ టి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సుమారు 200 మంది క్రీడాకారులు సౌత్ జోన్, అల్ ఇండియా స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జెఎన్‌టియు ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి, జెఎన్‌టియు పరిధిలోని 80 మంది వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల జీవన పరిస్థితులపై అధ్యయనం అవసరం

'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నమే యాత్రల లక్ష్యంగా ఉండాలని ఔత్సాహిక యాత్రికుడు, రచయిత దాసరి అమరేంద్ర పేర్కొన్నారు. ఔత్సాహిక యాత్రికుడు డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి ఆంగ్లంలో చేసిన లాటిన్ అమెరికా యాత్రారచనను 'మనమెరుగని లాటిన్ అమెరికా' పేరుతో అమరేంద్ర తెలుగులోకి అనువదించారు. గురువారం సాయంత్రం అనంతపురం ఎన్జీవో హోమ్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఈ పుస్తక పరిచయ కార్యక్రమాన్ని డా॥ఎం.ప్రగతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥ప్రగతి మాట్లాడుతూ స్థానిక సంస్కృతితో సంపర్కం చెందకుండా చేసే యాత్రలు నిష్ఫలమన్నారు. బిఎస్ఎన్ఎల్ విశ్రాంత డివిజనల్ ఇంజినీర్ జి.శంకరనారాయణ లాటిన్ అమెరికా దేశాల్లోని ప్రజలతో డాక్టర్ శేషగిరి మమేకమైన తీరును ప్రశంసించారు. ఆయా దేశాల్లో జన సాంస్కృతిక వైరుధ్యాలను అర్థం చేసుకున్న రచయిత ఆలోచనలకు ఈ పుస్తకం ప్రతిబింబం అన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎజి.రాజ్‌మోహన్ మాట్లాడుతూ విజ్ఞానకేంద్రం నిర్వహిస్తున్న విభిన్న కార్యక్రమాలను పరిచయం చేశారు. రాధా స్కూల్ ఆఫ్ లెర్నింగ్ కరెస్పాండెంట్ వేలూరు జయచంద్ర తెలుగులో యాత్రాసాహిత్యాన్ని ప్రధాన ప్రక్రియగా ఎంచుకుని రచనలు చేస్తోన్న ప్రముఖ రచయితలలో అమరేంద్ర ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఎస్ఎం.బాషా, చంద్రశేఖర్, డా॥ప్రసూన, రచయితలు రాజారామ్, తరిమెల అమర్నాథరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, డా॥శాంతినారాయణ, ఈశ్వరరెడ్డి, సత్యబోసు, గోవిందరాజులు, తిరుపాలు, టివి.రెడ్డి, నజీర్, అనంతమాలతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రచయిత దాసరి అమరేంద్ర

ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయం

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌ఛార్జి కలెక్టర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఛైర్మన్, డైరెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. గురువారం అనంతపురం జెఎన్‌టియులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రంలో బోర్డు సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఇన్నోవేషన్ హబ్, పారిశ్రామిక రంగ అభివృద్ధికి బోర్డ్ డైరెక్టర్లు తగినంతగా సహకరించాలని కోరారు. స్టార్టప్ నుంచి నిర్దేశించిన పెట్టుబడులు సమీకరిస్తూ మహిళలకు, యువతకు నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ బోర్డు డైరెక్టర్లు కనకారావు, పికె.మురుగన్, జేఎన్టీయూ ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం కివాడే, యోగేష్ ఇందివర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

కూటమి ప్రభుత్వంతోనే చేనేతల అభివృద్ధి

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు

ప్రజాశక్తి -అనంతపురం

కూటమి ప్రభుతంతోనే చేనేతల అభివృద్ధి సాధ్యమని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. చేనేతలకు బ్రాండ్ అంబాసిడర్ మంత్రి నారా లోకేష్ అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో కలెక్టరేట్ నుంచి ఆప్కో ఆఫీస్ వరకూ చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఎడి వరప్రసాద్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అంది స్తుందని, చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టి చెల్లిస్తుందని, థ్రిఫ్ట్ ఫండ్ కోసం నిధులు కేటాయించిందన్నారు. చేనేత కార్మికులకు త్వరలోనే రూ. 25వేలు ఇవ్వనుందన్నారు. భవిష్యత్తులో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తారని, తద్వారా ఉత్పత్తి అధికంగా చేసి, ఉత్పత్తులకు డిమాండ్‌ను కల్పించే ఆలోచన చేయడం శుభపరిణామం అన్నారు. వర్క్ షెడ్ల నిర్మాణం కోసం రుణాలు ఇచ్చిందన్నారు. అనంతరం చేనేత కళాకారులను శాలువాలు, రేషం హారాలతో సన్మానించారు. కార్యక్రమంలో సహకార అధికారిణి అరుణ కుమారి, జౌళి శాఖ అభివృద్ధి అధికారి బసవరాజు, చేనేత సంఘం నేత నరసింహులు, ఎఎంఒ శివప్రసాద్, ఎడిఒలు మురళి, కాంతారావు, రాఘవేందర్ రెడ్డి, పూల శ్రీనివాసులు, గోపాల్, చేనేత సహకార సొసైటీ అధ్యక్షులు, కళాకారులు పాల్గొన్నారు.

అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

'ప్రజా దర్శిని'తో పాలన మరింత చేరువ

ప్రజాశక్తి-తాడిపత్రి

'ప్రజా దర్శిని' వంటి కార్యక్రమాల ద్వారా పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పాతకోట వార్డు సచివాలయంలో గురువారం ఆయన పర్యటించి సమస్యలు, పరిస్థితులను సమీక్షించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ వంటి ప్రధాన అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులపై తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 'ప్రజాదర్శిని' ఒక మంచి వేదిక అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, వాటర్ సప్లై, విద్యుత్ శాఖల సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

'సత్యసాయి' తాగునీటి పథకం కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-ఆత్మకూరు

బకాయి వేతనాలు చెల్లించకపోతే ఈ నెల 11వ తేదీ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం పలు మండలాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 540 మంది కార్మికులు దాదాపు 850 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. 4 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. వేతనాలు ఇవ్వకపోతే ఈ నెల 11వ తేదీ నుంచి పంపు హౌస్‌ల వద్ద మోటార్లు ఆఫ్ చేసి సమ్మెలోకి వెళ్తామన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో చిన్నా, శ్రీరాములు, నీలకంఠ, శివ, ఓబన్న, హరిప్రసాద్, రమేష్‌రెడ్డి, ఇమాములు, దివాకర్, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరులో సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

వైసిపి ఎమ్మెల్సీపై దాడి అమానుషం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి ఉరవకొండ

పులివెందుల మండలం నల్లగొండువారిపల్లెలో వైసిపి ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై టిడిపి మూకలు దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్ప డుతూ రౌడీ రాజకీయాలు చేస్తుందన్నారు. దాడి చేసిన వారిపై కేసులు పెట్టకుండా వైసిపి కార్యకర్తలను బైండోవర్ చేయడం ఏంటని ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై కేసులు పెట్టకపోవడం, అరెస్టు చేయకపోవడం చూస్తుంటే పోలీసులు ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మల్లా మారరని అనిపిస్తుందన్నారు. మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పివికెకె విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉన్న పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రముఖ వాటర్‌ప్రూఫింగ్ సేవల సంస్థ శ్రీసాయి రక్షా ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు సివిల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ.షౌకత్‌అలీ, కె.బాలాజీ, కె.విశ్వాస్ ఎంపికయ్యారు. వీరిని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లుగా హైదరాబాద్‌లోని తమ సంస్థ విభాగంలో నియమిస్తారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు చెల్లిస్తారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, ప్రిన్సిపల్ డా. బండి రమేష్‌బాబు, యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్ రెడ్డి, సంస్థ మేనేజర్ సుమన్‌రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, సివిల్ విభాగాధిపతి రాజేష్, అధ్యాపకులు ఫయాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్‌రెడ్డి

ఆర్టీసీలో సమస్యలపై 12, 13తేదీల్లో ఎన్ఎంయుఎ ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆర్టీసీ స్థలాలను లీజుకి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ఎన్ఎంయుఎ రాష్ట్ర కార్యదర్శి ఎర్రిస్వామి తెలిపారు. పట్టణంలోని అజీజియా షాదీమహల్‌లో గురువారం జోనల్ సహాయ కార్యదర్శి ఎంఎండి షఫీ అధ్యక్షతన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయుఎ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎర్రిస్వామి మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు పథకానికి పూర్తిగా సహకరిస్తామని, అయితే అందులో ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ స్థలాలను లులు సంస్థకు లీజుకు ఇవ్వడాన్ని మానుకోవాలని కోరారు. డిపోలో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. 13 ఏళ్లుగా డిపో కార్యదర్శిగా పనిచేస్తున్న హెచ్.తిప్పేస్వామిని నాల్గో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా యు.రామాంజనేయులు, ఛైర్మన్‌గా కెఎస్.వలి, తదితరులను ఎన్నుకున్నారు.

హామీలను విస్మరిస్తే ప్రభుత్వ పతనం ఖాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వందశాతం అమలుచేయకపోతే వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతారని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ హెచ్చరించారు. స్థానిక ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సీనియర్ కామ్రేడ్ ఓబుళపతి అధ్యక్షతన నియోజకవర్గ సిపిఐ ప్రతినిధుల 21వ మహాసభలు నిర్వహించారు. ముందుగా సీనియర్ సిపిఐ నాయకులు ఎంవి.రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాఫర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మైనార్టీలో వుందని అలాంటి వారికి చంద్రబాబు ఊతమిచ్చి కాపాడుతున్నారని మండి పడ్డారు. రైతాంగాన్ని చంద్రబాబు మరిచిపోయారని, కార్పొరేట్ శక్తులకు వంతుపాడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు బిటిపి ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకురావాలని, కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ నూతన కార్యదర్శిగా గోపాల్, సహాయ కార్యదర్శిగా నరసింహులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నాయకులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అహుడా పెండింగ్ పనులను పూర్తి చేయండి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం- హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో ఉన్న ఎంఐజి లేఅవుట్ల పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో ప్రస్తుతం జరుగుతున్న లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వివిధ పట్టణాల్లో ప్రణాళిక బద్ధంగా సరసమైన ధరలకు టైటిల్‌తో కూడిన రెసిడెన్షియల్ ప్లాట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ద్వారా ఎంఐజి లేఅవుట్లను అహుడా ద్వారా చేపట్టాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం జీవో నెంబర్ 148 ద్వారా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ కింద ఉన్న ఎంఐజి లేఅవుట్‌లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ బుకింగ్ కానీ ప్లాట్లకు త్వరలో కమర్షియల్ యాక్షన్ విధానంలో అమ్మడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో అహుడా సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు దుష్యంత్, హరీష్, రేవంత్ ప్రసాద్ రమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

చేనేత వర్గాలకు టిడిపి అండ : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

చేనేత కార్మికులకు ఏ కష్టమొచ్చినా టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు అండగా ఉంటారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని 29వ వార్డులో చేనేత కార్మికులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు, సౌకర్యాలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేనేత మగ్గాల వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు స్విఫ్ట్ బండకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో టంకశాల హనుమంతు, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం, కౌన్సిలర్ జ్యోతి, టిడిపి నాయకులు తిప్పేస్వామి, ప్రవీణ్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మగ్గం నేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

నేతన్నల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

యాడికి : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ హాలులో గురువారం జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికులు తమ సమస్యలను నా దృష్టికి తీసుకొస్తే అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు చేనేత శాఖ మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ధర్మవరం తరహాలో యాడికిని చేనేత హబ్‌గా పేరు తేవాలన్నారు. అనంతరం 40 ఏళ్లుగా చేనేత వృత్తి సాగిస్తున్న కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, ఎంపిడిఒ వీర్రాజు, ఈఓఆర్‌డి శశికళ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు చలమారెడ్డి, విజన్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, గుండా నారాయణస్వామి, చరణ్, తాంత్ర విక్రమ్, రవికుమార్‌రెడ్డి, నీలకంఠ, నాగశేఖర్, ఆది, ఆదినారాయణ, నీలకంఠేశ్వర్‌రెడ్డి, చాంద్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు

పాఠశాల తనిఖీ

స్థానిక బుగ్గ రోడ్డులో ఉన్న నెంబర్-4 ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, మూత్రశాలలు, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. స్కూల్ ఆవరణలో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దాత సామాజికవేత్త జూటూరు అబ్దుల్ రజాక్‌ను అభినందించారు.

పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవాలయ శాఖ పర్యవేక్షణ అధికారి అశ్వర్థ, పప్పూరు దేవాలయ కార్యనిర్వాహణ అధికారి సుబ్రహ్మణ్యం సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలు విక్రయించేందుకు రూ. 24,80,000, కొబ్బరి చిప్పలు సేకరించేందుకు రూ. 6,85,000 దక్కించుకున్నారు. తలనీలాలు పోగు చేసుకునేందుకు, సామాన్లు బాడుగకు ఇవ్వడం, బియ్యం, బేడలు అమ్ముకొను హక్కు కోసం సరైన ఆదాయం రానందున వాటి వేలం నిలిపి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రమేష్ బాబు, పి.వెంకటేశులు, నరేష్, పోలీసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న ఆలయ భూముల కౌలుకు వేలం

తాడిపత్రి : పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర, చింతల వెంకటరమణస్వామి ఆలయాలకు చెందిన భూముల (మూడేళ్లు) కౌలుకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10-30 గంటలకు బుగ్గరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం నిర్వహి స్తున్నట్లు ఈవో రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఈవో 94933 74914లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

బెలుగుప్ప : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్ఎం ఎం.వెంకటప్రసాద్, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో పీర్ ఎడ్యుకేటర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ పాఠశాలలో నలుగురు, ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో ఇద్దరు, కేజీబీవీలో ముగ్గురు విద్యార్థినులకు యూనిఫామ్ అందజేశారు. ఎఎన్ఎం విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనారోగ్యంగా ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, శేఖర్, పిఈటి గోపాల్‌రెడ్డి, ఎఎన్ఎం రాధా, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో సోమవారం బసవరాజ్‌స్వామి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నాయకుడు సోమనాథ్‌గౌడ్ ఆ గ్రామం వెళ్లి రూ. బసవరాజ్‌స్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామ ర్శించి అంత్యక్రియల ఖర్చులకు రూ. 6వేలు అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు రుద్ర ముని, మహదేవ్ ఉన్నారు.

విద్యార్థులకు ఇంటర్ దశ కీలకం

నార్పల : ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమని ప్రిన్సిపల్ బాలప్ప తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెకండియర్ విద్యార్థులు ఘనంగా వెల్‌కమ్ పార్టీ ఇచ్చారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులందరూ కలిసి మెలిసి సోదర భావంతో ఉండాలన్నారు. జూనియర్లు ఏవైనా సందేహాలు ఉంటే సీనియర్లతో నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో కళాశాల సిబ్బంది బాబా మైనుద్దీన్, ఖాజాబీ, శివారెడ్డి, ఆనంద కుమార్, మురళి, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అనంతపురంలో సాయివిజ్ఞాన్ పాఠశాలలో రాఖీ సంబరాలు

'సాయి విజ్ఞాన్'లో రక్షాబంధన్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో గురువారం వరలక్ష్మీ వ్రతం, రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, హెచ్ఎం జి.లావణ్యారామ్ పాల్గొన్నారు. ముందుగా వారు అందరికీ వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఏటా శ్రావణమాస పౌర్ణమి రోజున రాఖీ పండుగ నిర్వహిస్తారని, సోదరి, సోదరుల ప్రేమకు నిదర్శనంగా రాఖీ కడతారని వివరించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించాలన్నారు. చివరగా విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు.

'దేశం కోసం మనలో ఒక్కడు' లఘు చిత్రం ప్రదర్శన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శ్రీసత్యసాయి జిల్లాలోని గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీర జవాను మురళినాయక్ దేశానికి చేసిన సేవలపై గోపివర్మ దర్శకత్వంలో నిర్మించిన 'దేశం కోసం మనలో ఒక్కడు' లఘు చిత్రం ప్రీమియర్ షోను గురువారం పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రదర్శించారు. ఈ లఘు చిత్రం ఈ నెల 15వ తేదీ విడుదల కానుంది. ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు మాట్లా డుతూ నేటి సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలి, ఆత్మహత్యల నుంచి ఎలా దూరంగా ఉండాలనే విషయాలను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకులు గోపివర్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.శేషయ్య, సిఐ యువరాజు, అమర్నాథ్‌రెడ్డి, డాక్టర్ కె. శ్రీధర్, వసంత కుమార్, నిజవల్లి బాబు, విలేకరులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు హెడ్ కానిస్టేబుల్ రమేష్ మృతదేహానికి అనంతపురంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రమేష్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత బుధవారం అనంతపురంలో మృతి చెందగా అక్కడే కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో సందర్శనార్థం ఉంచారు. గురువారం 6వ రోడ్డులోని శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రమేష్ మృతి పట్ల ఎస్పీ పి.జగదీష్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రమేష్ అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరపున ఎస్పీ రూ. లక్ష ఆయన భార్య రామలక్ష్మికి అందజేయించారు. అంత్యక్రియల్లో కళ్యాణదుర్గం రూరల్ సిఐ నీలకంఠ, ఎస్ఐ లోకేష్, కంబదూరు ఎఎస్ఐ ఓబుళపతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, బ్యాచిమేట్లు, కంబదూరు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఓ మోసం .. గర్భిణి ఆత్మహత్య..!

ప్రజాశక్తి-గుత్తి

ఓ విఆర్ఒ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భిణిని చేసి ఆతర్వాత మోసం చేయడంతో ఏడు నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. గుత్తిలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాధాన్ని నింపింది. విఆర్‌ఒపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం పలువురు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గుంతకల్లు పట్టణంలోని సోఫియా వీధికి చెందిన పీరాబాషా కుమార్తె షేక్ షమీంభాను భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. షమీం భాను రేషన్ కార్డులో చేర్పులు, మార్పులు కోసం మూడేళ్ల క్రితం గుంతకల్లు తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే విఆర్‌ఒ మహమ్మద్ వలిని కలిసింది. ఇలా వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. షమీంభానును ప్రేమిస్తున్నానని చెప్పి విఆర్ఒ మహ్మద్‌వలీ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఏడు నెలల గర్భిణిగా ఉన్న సమయంలో విఆర్ఒ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. ఈ వేధింపుల తాళలేక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఓ సెల్ఫీ వీడియో తీసి, సూసైడ్ నోటు రాసి ఆమె విషపు గులికలు మింగింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించి ఆమె మరణించింది.

గర్భిణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

వేధింపులకు గురి చేసి ఏడు నెలల గర్భిణి ఆత్మహత్యకు కారణం అయిన విఆర్ఒ మహ్మద్ వలీని అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం గుత్తి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న షమీం భాను మృతదేహాన్ని పరిశీలించి అక్కడే ధర్నా నిర్వహించారు. విఆర్ఒ వేధింపుల అంశాన్ని రెండు నెలల క్రితమే షమీం భాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అప్పుడు విఆర్ఒపై చర్యలు తీసుకుని ఉంటే షమీం భాను ఆత్మహత్య చేసుకుని ఉండేది కాదన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ గుంతకల్లు డివిజన్ నాయకులు జిలాన్, సత్తార్, రామాంజనేయులు, ఐఎఫ్‌టియు నాయకులు రామదాసు, రఘు, సురేంద్ర, నారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారు నగలు చోరీ

24 గంటల్లోపు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బంగారు నగల చోరీ అయిన 24 గంటల్లోపు పోలీసులు కేసును ఛేధించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బుక్కరాయసముద్రం గ్రామంలోని ఎంపిడిఒ కార్యాలయం వెనుకు పాముల తిప్పక్క నివాసం ఉంటోంది. ప్రతి రోజూ ఈమె కూరగాయల వ్యాపారం నిమిత్తం ఉదయం 3గంటలకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తుంది. ఇదే విధంగా ఈ నెల 6వ తేదీ ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. దీనిని అదునుగా చేసుకుని కొందరు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉంచిన ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఉదయం 7 గంటల సమయంలో ఇంటికొచ్చిన చూసిన తిప్పక్క దొంగతనం జరిగిన విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిఐ కె.పుల్లయ్య, ఎస్ఐ రాంప్రసాద్, పిఎస్ఐ కళ్యాణ్, సిబ్బందితో కలిసి అనుమానితులైన గాజుల ఇంద్రసేనారెడ్డి, గాజుల శశి కుమార్ రెడ్డి, బద్రిలను అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారు. వారి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోపు నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సిఐ కె.పుల్లయ్య, ఎస్ఐ రాంప్రసాద్, పిఎస్ఐ కళ్యాణ్, ఎఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, పిసిసి స్వాధప్ప, శ్రీనివాసులు, అక్బర్, గోపాల్ యాదవ్, డబ్ల్యూటీసి స్వప్న, శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై కావేరమ్మ(52) మృతిచెందింది. ఆమె ఇంటి బయట గదిలో హీటర్ వేస్తుండగా తడిగా చేతులుండడంతో విద్యుత్‌షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమెకు భర్త రామాంజనేయులు, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. వీరంతా కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. కావేరమ్మ మృతి పట్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపి.రమేష్, ఇతర నాయకులు సంతాపం ప్రకటించారు. శవానికి పోస్టుమార్టం అనంతరం పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

ఓ హత్యాయత్నం కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ ధరణిబాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రూరల్ ఎస్ఐ సిబ్బందితో కలిసి సజ్జలదిన్నె గ్రామం వద్ద వేణుగోపాల్‌రెడ్డి బండల ఫ్యాక్టరీ సమీపంలో కాపు కాశారు. ఈ క్రమంలో సజ్జలదిన్నె గ్రామానికి చెందిన ఉప్పర రాజేష్, మంగళ సాయి, ఆంజనేయులు, చిన్న ఓబులేసు, తాడిపత్రి పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన ముగల రాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే వారి నుంచి 3 కత్తులు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కళ్యాణదుర్గం టౌన్ : దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలంటే ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగరాలని మున్సిపల్ అధికారులు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ మేనేజర్ అశ్వర్థనారాయణ, మెప్మా టీఎంసీ హర్షద్‌అహమ్మద్, కమ్యూనిటీ అర్గనైజర్లు రామ్మోహన్, సంధ్య, నబిరసూల్, మెప్మా సిబ్బందితో కలిసి గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ హర్ ఘర్ తిరంగా పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీ ప్రతిపౌరుడు బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ప్రహరీ లేని గ్రంథాలయం..!

మల, మూత్ర విసర్జనతో పరిసరాల్లో దుర్గంధం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రమైన నార్పలలో గ్రంథాలయానికి ప్రహరీ నిర్మించాలని పాఠకులు, ప్రజలు కోరుతున్నారు. గతంలో గ్రంథాలయానికి శాశ్వత భవనం లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో అధికారులు, అప్పటి ఎంపి రంగయ్య నిధులతో గ్రంథాలయానికి నూతన శాశ్వత భవనం నిర్మించారు కానీ ప్రహరీ ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళ పలువురు గ్రంథాలయ ఆవరణలో మల, మూత్ర విసర్జన చేస్తుడడంతో ఆ పరిసరాల్లో అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాఠకులు, విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయానికి ప్రహరీ నిర్మించాలని పాఠకులు, ప్రజలు కోరుతున్నారు.

నార్పలలో ప్రహరీ లేని గ్రాంథాలయం

'పోలీస్' కారుకి నెంబర్ అవసరం లేదా..?

ప్రజాశక్తి-పుట్లూరు

ఆటోలు, బైక్‌లు, కార్లు, ఇతర ఎలాంటి వాహనాలైనా రోడ్డుపై వెళ్తుంటే ఆపి ఆర్‌సి, నెంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉన్నాయా అని తనిఖీ చేసి ఏవైనా సరిగా లేకపోతే పోలీసులు జరిమానా విధిస్తుంటారు. అయితే మండల కేంద్రమైన పుట్లూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహి స్తున్న ఓ కానిస్టేబుల్ తన కారుకి రిజిస్ట్రేషన్ నెంబర్ లేకుండా కేవలం డ్యాష్‌బోర్డుపై 'పోలీస్' అనే నేమ్ ప్లేట్ పెట్టుకుని ఆ వాహనంలో చక్కర్లు కొడుతున్నాడు. సామాన్యులు వాహనంపై వెళ్తుంటే తనిఖీల పేరుతో రకరకాల ప్రశ్నలు వేసి ఆధారాలన్నీ అడిగి ఏవైనా లేకపోతే జరిమానా విధించే పోలీసులకు ఈ 'పోలీస్' కారు కనపడలేదా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కారు డ్యాష్ బోర్డుపై కేవలం 'పోలీస్' అనే నేమ్ ప్లేట్ పెట్టుకుని యథేచ్ఛగా తిరుగుతున్నా అడిగే వారే లేరా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.


నెంబర్ లేకుండా పోలీస్ నేమ్ ప్లేట్ వేస్కుని తిప్పుతున్న కారు

పుట్టిన బిడ్డకు ముర్రుపాలే రక్ష

ప్రజాశక్తి-శింగనమల

పుట్టిన బిడ్డకు ముర్రుపాలే రక్ష అని ఐసిడిఎస్ పిడి నాగమణి పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ పిడి నాగమణి హాజరై వాల్ పోస్టర్ విడుదల చేశారు. పిడి మాట్లాడుతూ ముర్రుపాలు ప్రాధాన్యతను వివరించారు. బిడ్డకు పాలు తాపించడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని, బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, జాగ్రత్తలను తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని, లబ్ధిదారులకు గుడ్లు, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, సిడిపిఒ లలితమ్మ, సూపర్వైజర్లు కల్పన, వాణిశ్రీ, కౌసల్య, ధనలక్ష్మి, నేతాజీ, విష్ణువర్ధన్, ఓబులేసు, యూనియన్ లీడర్లు రమణమ్మ, కాత్యాయని, సెక్టార్ లీడర్లు భారతి, ప్రమీలమ్మ, బి.రత్నమ్మ, నాగేశ్వరమ్మ, బి.విమల, సుజాత, ఎల్లమ్మ, భాగ్యమ్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కందికాపుల అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.లావణ్య ముర్రుపాలు, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.వనిత, ఎంఎల్హెచ్‌పి హరిత, అంగన్వాడీ కార్యకర్తలు శారద, సరస్వతి, ఆశా వర్కర్ నారాయణమ్మ, గర్భిణీ, బాలింతలు పాల్గొన్నారు.

ఉరవకొండ : బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేష్ఠమని, తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని వైద్యాధికారి డాక్టర్ తేజస్వి పేర్కొన్నారు. వజ్రకరూరు పిహెచ్‌సి పరిధిలోని గూళ్యపాలెం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైద్యాధికారి డాక్టర్ తేజస్వి హాజరయ్యారు. ముందుగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలు పట్టాల్సిన ఆవశ్యకత, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఎఎన్ఎం భ్రమరాంబ, ఎంఎల్‌హెచ్‌పి అనురాధ, హెల్త్ అసిస్టెంట్ బసినేని నాగరాజు, ఎఎన్ఎం జయమ్మ, ఆశా కార్యకర్తలు నీలావతి, నాగరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, సువర్ణ, సరోజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమలలో తల్లిపాల వారోత్సవంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి నాగమణి

నార్పల : వారం రోజులుగా మండల వ్యాప్తంగా జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్థానిక ఉయ్యాలకుంట-2 అంగన్వాడీ సెంటర్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఎఎన్ఎం నాగేశ్వరమ్మ, మహిళా పోలీస్ చాంద్‌ఉస్మాని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే లాభాలు, తల్లి పాలిచ్చే విధానం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు డి.శ్రీదేవి, డి.భారతి, జరీనా బేగం, నాగమణి పాల్గొన్నారు.

రాయదుర్గం : మండలంలోని టి.వీరాపురం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరత్న, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు రామాంజనేయులు, శ్రీనివాసులు, సుజాత, జ్యోతి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులకు సీమంతాలు, తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాధ, సరస్వతి, హేమలత, వనజ, హనుమక్క, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బెళుగుప్ప : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి తెలిపారు. మండలంలోని తగ్గుపర్తి అంగన్వాడీ సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ లిఖిత, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు నివాళి

తాడిపత్రి : డాక్టర్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా సోమవారం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామ్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించినారన్నారు. ఆయన ప్రధానంగా రైతాంగ సమస్యల పరిష్కారం, ఆత్మహత్యల నివారణ, మద్దతు ధరలు, మహిళా రైతులను గుర్తించాలని, భారతదేశంలో హరిత విప్లవాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ, టమోటా, ఉల్లగడ్డలు వంగడాలను అభివృద్ధి చేసి ఆహార ఉత్పత్తి పెంచడంలో విశేష కృషి చేశారన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా పరిశోధనలు చేసి ఎన్నో కొత్త వంగడాలను అభివృద్ధి చేశారన్నారు. సమాజం అభివృద్ధి, రైతు సంక్షేమానికి అనేక పద్ధతుల ద్వారా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, సంజీవ, హరి, శీన, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ శ్రీజిహ్వేశ్వరస్వామి జయంతి

రాయదుర్గం : పట్టణంలోని స్వకులసాలి సామాజిక వర్గం ప్రజలు గురువారం భగవాన్ శ్రీజిహ్వేశ్వరస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న హటకేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజ సత్రంలో స్వామివారికి నామ కరణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని, ఉత్సవ మూర్తిని వెండి రథంలో ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి చరిత్రను చదివి వినిపించారు. అలాగే ఆ సమాజా నికి చెందిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చివరగా అన్నదానం చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ సమాజం అధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆనందరావు, విమల, సరస్వతి, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యుజి 2,4 సెమిస్టర్ల ఫలితాలు విడుదల

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ పద్మశ్రీ యుజి-2, 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసారు. ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్‌కెయు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జి.వి.రమణ, పరీక్షల విభాగ పర్యవేక్షణ అధికారి శ్రీరాములు నాయక్, ప్రిన్సిపల్ పద్మశ్రీ, పరీక్షల విభాగాధిపతి తిరుమలేష్, వివిధ విభాగాధిపతులు పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో 65.27 శాతం, 4వ సెమిస్టర్‌లో 74.39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో ఉప పరీక్ష విభాగాధిపతులు చంద్రశేఖర్, జిఎల్ఎన్.ప్రసాద్, అధ్యాపకులు కేశాలు, సూగప్ప, బాలాజీనాయక్, ఈశ్వరరెడ్డి, శ్రీరాములునాయక్, పూల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థికి సన్మానం

ఆత్మకూరు : మండల కేంద్రమైన ఆత్మకూరుకు చెందిన కనికరెడ్డి కొండారెడ్డి కుమారుడు కుమార్‌రెడ్డి ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎపిఎస్‌పి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. దీంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుమార్‌రెడ్డిని ఎస్ఐ జి.లక్ష్మణరావు సత్కరించి అభినందించారు. ఎస్ఐ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ

బ్రహ్మసముద్రం : వాహనాలు నడిపే డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సులభతరం అవుతుందని ఎస్ఐ నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని కొండాపురం, సూగేపల్లి గ్రామాల మధ్యలో గురువారం ఎస్ఐ వాహనాలను ఆపి తనిఖీ చేసి డ్రైవర్లకు పలు జాగ్రత్తలు, నియమ, నిబంధనలను తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్ వాహనాలకు సీట్ బెల్ట్ తప్పనిసరి అన్నారు. అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ విజయ్‌భాస్కర్, నాగరాజు, కానిస్టేబుల్స్, హోంగార్డులు ఉన్నారు.

రైల్వే కార్మికులకు వైద్య శిబిరం

గుత్తి : పట్టణంలోని రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం గుంతకల్లు రైల్వే ఆసుపత్రి, గుత్తి రైల్వే హెల్త్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు, సూపర్వైజర్లు, అధికారులకు వైద్య శిబిరం నిర్వహించారు. షెడ్ సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ప్రమోద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రైల్వే వైద్య నిపుణులు కార్మికులు, సూపర్వైజర్లు, అధికారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, వైద్యులు మురళి, విజయలక్ష్మి, హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకునిపై ఫిర్యాదు

అనంతపురం సిటీ : నగరంలోని కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు క్రీడా మైదానంలో అసభ్యకర పదజాలంతో దూషిస్తూ తన కాళ్లకున్న బూట్ల లేస్‌లను విద్యార్థినులతో కట్టించుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జి.చంద్రశేఖర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆ అధ్యాపకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సత్యలతకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మంజునాథ్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, కైలాష్, రాహుల్‌రెడ్డి, ఫయాజ్, శేఖర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

ప్రజాశక్తి-నార్పల

స్థానిక గ్రంథాలయంలో గురువారం విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ వర్ధంతి సందర్భంగా గ్రంథా లయ అధికారిణి కావేరి ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఠాగూర్ రచించిన గొప్ప కావ్యం గీతాంజలితో పాటు ఆయన రచించిన పుస్తకాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఠాగూర్ సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త, రిటైర్డ్ కండక్టర్ ప్రసాద్, గ్రంథాలయ అటెండర్ వెంకటేష్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా ఉపాధ్యక్షులు స్వర్ణం, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, నాయకులు షెక్షావలి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, హసన్‌అహ్మద్, వెంకటేష్, దేవదాస్, నరసింహులు, శామ్యూల్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎఆర్ కానిస్టేబుల్ కూతురుకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఎఆర్ కానిస్టేబుల్ రాము కూతురు భవ్యశరణ్య 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించినందులు అనంతపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ ప్రతిభా పురస్కారం అందజేశారు. దీంతో భవ్య శరణ్యను బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించా లని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్‌డిటి లబ్ధిదారులతో కలిసి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటి 50 ఏళ్లకు పైగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు అనేక సేవలందిస్తుందన్నారు. రైతులకు అండగా ఉందన్నారు. ఇంటర్, వైద్య, ఇంజినీరింగ్ విద్యార్థులను చదివిస్తుందన్నారు. వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తుందన్నారు. కావున వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని, లేనిచో ప్రజలు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వైటిసి రమేష్, పట్టణ అధ్యక్షుడు చంద్ర, నాయకులు వంశీ, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కళ్యాణదుర్గం టౌన్ : ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక ఆర్‌డిటి అతిథి గృహం వద్ద ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, మాజీ జెడ్పీటీసీ కొల్లాపురప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు నారాయణ, లాయర్ ఆంజనేయులు, మారెప్ప, సురేంద్ర, విజయ్, పలువురు సమావేశమయ్యారు. కేంద్రం వెంటనే సమస్యను పరిష్కరించాలని లేనిచో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను, బిజెపి మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలో శింగనమల వాసులకు చోటు

అధ్యక్షుడిగా తరిమెల గిరి, సహాయ కార్యదర్శిగా సూర్యప్రకాష్

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల శింగనమలలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 33వ జిల్లా ప్లీనరీ సమావేశాల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో మండల వాసులకు ఇద్దరికి చోటు దక్కింది. తరిమెల గ్రామానికి చెందిన గిరి అధ్యక్షులుగా, రాచేపల్లి గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గిరి జిల్లా విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో అంచెలంచెలుగా ఎదిగారు. యూని వర్సిటీ నాయకుడిగా ఉంటూ వైస్ ఛాన్సలర్ వివాదాస్పద నిర్ణయాలను ఎప్పటి కప్పుడు ఖండిస్తూ ఉద్యమాలు చేపట్టారు. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాల కోసం

సూర్యప్రకాష్

చలో కలెక్టరేట్ నిర్వహించగా కేసులు నమోదయ్యాయి. న్యాయవాదిగా ఉంటూ విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. వామపక్ష పోరాటాల పురిటిగడ్డ తరిమెల గ్రామం నుంచి జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సూర్యప్రకాష్ వెనుకబడిన శింగనమల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారు. శింగనమలలో బాలికల సంక్షేమ హాస్టల్, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం నిర్విరామంగా పోరాడారు. కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా ప్రభుత్వ విద్య వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమిస్తామన్నారు.